


టెక్స్‌టైల్ పార్కుకు కేటాయించిన భూముల్లో వేసిన జగనన్న ప్లాట్లు



రివర్స్ టెండర్ పేరుతో స్లూయిస్ పనులకే పరిమితమైన ఆర్డీఎస్ కుడి కాలువ

ఒక్కటి నెరవేర్చింటే ఒట్టు...!

- పోయిన ఎన్నికలప్పుడు ఇబ్బడిముబ్బడిగా హామీలు
- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని పాలకులు
- పుష్కరకాలం దాటినా పూర్తికాని యూజీడీ
- ముందుకు సాగని ఆర్డీఎస్ కుడి కాలువ, జీడీపీ పైప్‌లైన్ పనులు
- ఐదేళ్ల కాలంలో దోచుకోవడమే పనిగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 20:

మాట తప్పను.. మడమ తిప్పనంటూ ఎన్నికల సమయంలో ఉపన్యాసాలు ఇచ్చిన జగన్ ఎమ్మిగనూరుకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి అంటే ఒక్కటీ అమలు చేయలేదు. 2019 సార్వత్రికున్నికల సందర్భంగా ఎమ్మిగనూరుకు వచ్చిన జగన్ పలు హామీలను ప్రజలకు ఇచ్చాడు. ఇందులో ప్రధానంగా ఎల్లెల్సీ పరిధిలో రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తామని, చేనేత కార్మికులకు షెడ్లు నిర్మిస్తామని, చేనేతల రుణాలు మాఫీ చేస్తామని చెప్పారు. నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని వాగ్దానం చేశారు. జగన్ ఇచ్చిన ఈ హామీల్లో ఇప్పటికి ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదు. ఐదేళ్ల పాలనలో రెండు సార్లు ఎమ్మిగనూరుకు వచ్చిన జగన్ ఈ హామీల ఊసే ఎత్తలేదు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఒక్కరోజు కూడా పెదవి విప్పింది లేదు. ఐదేళ్లపాటు తన కుమారుని సీటు కోసమే పోరాటం చేశారే తప్పా హామీలను అమలు చేయాలని ప్రశ్నించిన సందర్భం లేదు. దీంతో జగన్ ఇచ్చిన హామీలు బుట్ట దాఖలయ్యాయి.

హామీల అమలుకు చొరవ చూపని ఎమ్మెల్యే

2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపే లక్ష్యంగా పలు హామీలను ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఇచ్చారు. ఐదేళ్ల పదవీ కాలం పూర్తయినా హామీల అమలుకు చొరవ చూపలేదు. ఎమ్మెల్యేగా గెలిస్తే పట్టణంలో యూజీడీ పనులు పూర్తి చేయటం, ఎల్లెల్సీ నీటి కోటా సాధిస్తానని, గ్రామాల్లో తాగునీటి సమస్య చేస్తామని చెప్పారు.

● రైతు బిడ్డగా చెప్పుకునే ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి రైతు సమస్యలను పట్టించుకోలేదు. ఐదేళ్ల పదవీ కాలంలో ఎల్లెల్సీ నీటి కోటాను రాబట్టడంలో విఫలమయ్యారు. దీంతో నియోజవర్గంలో సాగునీరు అందక అనేక గ్రామాల్లో రైతులు నష్టపోయారు. చాలా గ్రామాల్లో భూములు బీడు భూములుగా మారాయి. ఎల్లెల్సీ ఆధునికీకరణకు నిధులు వచ్చినా ఎమ్మెల్యే పట్టించుకోకపోవటంతో పనులు పూర్తి కాలేదు. కాలువ లైనింగ్ దెబ్బతిని నీరు వృథాగా పోతున్నాయి. అలాగే గోనెగండ్ల మండలంలో ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరి కింద పొనకలదిన్నె, మిట్టసోమపురం ప్రాంతాలకు సాగునీటి కొరత ఉంది. ఎల్లెల్సీ కింద 3500 ఆయకట్టు ఉంది. గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి ఎల్లెల్సీ నుంచి ఎత్తిపోతల పనులు చేపట్టాల్సి ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎమ్మెల్యే పట్టున్న గ్రామాల్లో గువ్వలదొడ్డి ఒకటి. ఈ గ్రామంలో 2011లో చెరువుకు భూములిచ్చిన రైతులకు నేటికీ పరిహారం అందలేదు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి విజయానికి కీలకంగా ఉన్న గువ్వలదొడ్డి రైతులనే ఎమ్మెల్యే పట్టించుకోకపోవటం గమనార్హం.



అసంపూర్తిగా ఉన్న జీడీపీ పైపులైన్ ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణం

15 ఏళ్లుగా కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

2009లో ఎమ్మెల్యేగా గెలిచిన చెన్నకేశవరెడ్డి పట్టణంలో యూజీడీ పనులను ప్రారంభించారు. యూజీడీ పనుల కోసం పట్టణమంతా సీసీరోడ్లను తవ్వి రోడ్లను గుంతల మయం చేశారు. ఈ పనులు నేటికీ పూర్తి కాలేదు. 2019లో నాలుగోసారి నెగ్గిన ఎమ్మెల్యే మూడు నెలల్లో యూజీడీ పనులను పూర్తి చేస్తామన్నారు. అయితే ఐదేళ్లు అధికారంలో ఉన్నా పనులు పూర్తి కాలేదు. అధికారుల నిర్లక్ష్యం ఎమ్మెల్యే పట్టించుకోకపోవటంతో యూజీడీ పనులు ముందుకు సాగటం లేదు. గుంతల రోడ్లతో పలు కాలనీల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఐదేళ్లుగా యథేచ్ఛగా దోపిడీ..

ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వయోభారంతో ఇంటికే పరిమితం కావడంతో ఆయన కుమారుడు, కుటుంబ సభ్యులు, అనుచరులు ఎమ్మిగనూరులో ఈ ఐదేళ్ల కాలంలో హవా కొనసాగించారు. రియల్ వెంచర్లలో తమ మార్క్ ఉండేలా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు చూసుకున్నారు. పట్టణంలోని సోమేశ్వర థియేటర్ సర్కిల్, అయ్యప్ప స్వామిగుడి సమీపాల్లో 64 సెంట్ల స్థలాల విషయంలో పంచాయితీలు చేసి స్థలాలను ఆక్రమించుకునేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుడికల్లు రోడ్డులో వెంచర్లు వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎకరాకు పదిసెంట్ల వరకు తమకు ఇవ్వాలని హుకుంజారీ చేసి మరీ వసూలు చేశారని చర్చ. వంద ఎకరాల్లో ఇప్పటికే దాదాపు 50 ఎకరాలకు పైగా వెంచర్లు వేసి అమ్మకాలు చేశారు. వీరి నుంచి ఎమ్మెల్యే తనయుడు 12 సెంట్ల స్థలాన్ని(ఒక సెంటు స్థలం విలువ దాదాపు రూ.6లక్షలు) నజరానాగా పొందినట్లు ఆరోపణలున్నాయి.

అటకెక్కిన ఆర్డీఎస్ కుడి కాలువ, జీడీపీ పైపులైన్ పనులు

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో సాగు, తాగునీటి కొరత తీర్చేందుకు టీడీపీ ప్రభుత్వ హయాలో అప్పటి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అప్పటి సీఎం చంద్రబాబును ఒప్పించి రూ. 1985 కోట్లు మంజూరు చేయించారు. అయితే తదుపరి ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఈ ప్రాజెక్టులను జగన్ ప్రభుత్వం రద్దు చేసింది. రివర్స్ టెండరింగ్ పేరుతో కాలయాపన చేసి నిధులు విడుదల చేయకపోవటంతో కుడికాలువ పనులు ఐదు గేట్ల వరకే నిలిచి పోయాయి. అలాగే ఎమ్మిగనూరు పట్టణానికి తాగునీరు అందించేందుకు రూ. 144 కోట్లు టీడీపీ హయాలో మంజూరయ్యాయి. ఈ పనులను కూడా రివర్స్ టెండరింగ్ పేరుతో వారికే అప్పగించారు. అయితే నిధులు విడుదల చేయకపోవటంతో కాంట్రాక్టర్ పనులను నిలిపేశారు. ఓహెచ్ఆర్ ట్యాంకులు దిష్టిబొమ్మలుగా మారాయి.

మున్సిపాలిటీలో ఉద్యోగాల కోసం వసూళ్లు

మున్సిపాలిటీలో ఉద్యోగాల భర్తీ కోసం మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్‌ను వాడుకొని అక్రమ వసూళ్లు చేయించారు. అంతేగాక మున్సిపాలిటీ పరిధిలో ఉన్న దుకాణాలకు నామమాత్రపు వేలాలు నిర్వహించి దుకాణదారుల నుంచి దాదాపు రూ.కోటి వరకు వసూలు చేశారన్న విమర్శలున్నాయి. మార్కెట్‌యార్డు దగ్గర నిర్మించిన దుకాణాలు, ఎంపీపీ షాపింగ్ కాంప్లెక్స్ రెన్యువల్స్, రూరల్ పోలీస్ స్టేషన్ ముందు కొత్తగా నిర్మిస్తున్న దుకాణాల కేటాయింపుల్లో గుడ్‌విల్ కింద ఎమ్మెల్యే అల్లుడు బసిరెడ్డి లక్షలాది రుపాయలు అక్రమ వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక వీవర్స్ కాలనీ మైదానంలో అనుమతుల లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు అధికార పార్టీ నాయకులపై ఆరోపణలు వచ్చాయి. ఈ అక్రమాలు, ఈ దందాలు చాలవన్నట్లు కడిమెట్ల, ఐకొండ ప్రాంతాల మధ్య ఉన్న అటవీ భూమిని ఆక్రమించుకొని ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ సైతం యువగళం సభలో ప్రస్తావించారు. అంతేగాక దేవదాయ భూములను సైతం నామమాత్రంగా వేలాలు వేసి ఆయనే సాగు చేసుకుంటున్నారు.



అసంపూర్తిగా ఉన్న యూజీడీ పనులు

ఐదేళ్లుగా ఎక్కడి సమస్యలు అక్కడే..

టీడీపీ ప్రభుత్వ హయాంలో బనవాసి సమీపంలో వంద ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు స్థలం కేటాయించారు. అయితే వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. చేనేతల ఉపాధి కోసం పద్మశ్రీ మాచాని సోమప్ప హయాంలో ఏర్పాటైన ఎమ్మిగనూరు వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆదరణకు నోచుకోకపోవడంతో మూడు వేల మంది సభ్యులు ఉన్న సొసైటీ నేడు 300 మందికి పడిపోయింది. ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రాంతాలకు జీవనాడి అయిన ఎల్లెల్సీ కింద 1.51 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఏపీకి రావాల్సిన నీటి వాటా రాబట్టే విషయంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జీడీపీ నుంచి తాగునీటి సరఫరా పైపులైన్‌కు నిధులు మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నందవరం మండలంలోని జీఆర్‌పీ ప్రాజెక్టు కింద నిర్మించిన ఎత్తిపోతల పతకాల నుంచి నేటికీ అరకొర నీరు రైతులకు అందుతోంది. గాజులదిన్నె ప్రాజెక్టు సమీపంలో గతంలో ఏపీ టూరిజం కింద ఉద్యానవనం, బోటింగ్ ఉండేది. అయితే ఇప్పుడు అవి మచ్చుకు కూడా కనిపించలేదు. టీడీపీ హయాంలో శివన్ననగర్, షైనార్టీ కాలనీలో నిర్మించిన టిట్కో గృహాలు నేటికి పంపిణీకి నోచుకోలేదు. గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రధాన రహదారులతో పాటు గ్రామీణరహదారులు గుంతలమయంగా మారాయి.

రేపు శ్రీశైల క్షేత్రానికి చంద్రబాబు



శ్రీశైలం, ఏప్రిల్ 20: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సోమవారం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు దర్శించుకోనున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా సుండిపెంట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా సాక్షిగణపతి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుని శ్రీశైలంలోని భ్రమరాంబ సదన్ అతిథి గృహానికి చేరుకుంటారు. తరువాత క్షేత్రపరిధిలోని బయలు వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం తిరిగి హైదరాబాద్‌కు చంద్రబాబు వెళ్లనున్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 20: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు, కోడుమూరు టీడీపీ అభ్యర్థులు టీజీ భరత్, బొగ్గుల దస్తగిరి తదితరులు హాజరయ్యారు ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 15 సంవత్సరాలు ప్రతిపక్ష నాయకుడిగా, సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడన్నారు. ఆయనకున్న విజయన్ మరెవరికీ లేదన్నారు. అలాంటి నాయకుడి ఆధ్వర్యంలో పని చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. గత ఎన్నికల ముందు జగన్‌రెడ్డి మోసపూరితమైన వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చాడన్నారు. కానీ అవేమీ నెరవేర్చకపోడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. సీఎం జగన్ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నాశనం చేశాడన్నారు. వచ్చేనెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకుని చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రి చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. అందుకోసం కార్యకర్తలు సైనికుల మాదిరి పనిచేసి సైకో జగన్‌ను తరిమికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంద్యాల నాగేంద్ర, వి.హనుమంతరావు చౌదరి, గడ్డం రామకృష్ణారెడ్డి, జిల్లెల శ్రీరాములు, సోమిశెట్టి నవీన్, ముంతాజ్, సంజీవలక్ష్మి, సత్రం రామకృష్ణుడు, డి.జేమ్స్, షేక్షావలి, ఎస్.అబ్బాస్, బాలవెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

26న అమ్మవారి ఆర్జిత సేవలు నిలుపుదల



శ్రీశైలం, ఏప్రిల్ 20: శ్రీశైలం మహాక్షేత్రంలో ఈ నెల 26న భ్రమరాంబికాదేవి అమ్మవారికి వార్షిక కుంభోత్సవాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించనుంది. అమ్మవారి ఆలయంలో నిర్వహించే అన్ని ఆర్జిత సేవలు, చండీహోమాన్ని కుంభోత్సవం రోజున నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవ సంబంధిత పూజలన్నీ అమ్మవారికి ఏకాంతంగా నిర్వహించనున్నారు. అయితే కుంభోత్సవం రోజున సాయంత్రం వేడుక తరువాత భక్తులకు రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు భ్రమరాంబికాదేవి అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. కుంభోత్సవం రోజున మధ్యాహ్నం వరకు మాత్రమే స్వామి సర్వ దర్శనం, ఆర్జిత అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు, సాయంత్రం నుంచి స్వామి వారి ఆర్జిత అభిషేకాలు నిలుపుదల చేస్తునట్లు తెలిపారు. అలాగే కుంభోత్సవం రోజున స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, ఏకాంత సేవను నిలిపివేస్తున్నట్లు అధికారులు చెప్పారు. దేవదాయ, ధర్మదాయ చట్టం ప్రకారం శ్రీశైలం క్షేత్రపరిధిలో పక్షి, జంతు బలులు, జీవహింస పూర్తిగా నిషేధమని, ఎవరైనా ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

శాంతించిన భానుడు

45 డిగ్రీల నుంచి 37.5 డిగ్రీలకు తగ్గిన ఉష్ణోగ్రత



కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 20: నెల రోజులుగా ఎండలతో తన ప్రతాపాన్ని చూపిన సూర్యుడు ఎట్టకేలకు శాంతించాడు. గత రెండు రోజులుగా కర్నూలు జిల్లాలోని పలుప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురవడంతో పాటు ఎండ తీవ్రత కూడా తగ్గిపోయింది. శనివారం 37.5 డిగ్రీల మేర పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నెల రోజులుగా 40 నుంచి 45 డిగ్రీల వరకు ఎండ తీవ్రత ఎక్కువై జిల్లా ప్రజలు అల్లాడిపోయారు. ఈ క్రమంలో ఎండ వేడిమి తగ్గడంతో జిల్లా ప్రజలు ఉపశమనం పొందారు. ఇదిలా ఉండగా ఇకపై ఎండల తీవ్రత ఎక్కువగా ఉండదని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 20: పీడబ్ల్యూడీ, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జెండర్ల ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శనివారం పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన మౌలిక వసతులు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీల్‌చైర్లు, బ్రెయిలీ ఓటర్ స్లిప్పులు, బ్రెయిలీ పోస్టర్లను హెల్ప్‌డెస్క్‌లను పోలింగ్ స్టేషన్‌లలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి టీఏ, డీఏలకు సంబంధించి ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బడ్జెట్ ఇచ్చామని తెలిపారు. అన్ని ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టుల వద్ద షెడ్డు, తాగునీరు, విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ పార్టీలకు అవసరమైన వాహనాల వివరాలను ఏప్రిల్ 20వ తేదీలోపు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌కు ఇవ్వాలని చెప్పారు. డీటీసీ ఆర్వోలతో సమన్వయం చేసుకుని వాహనాల ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికను ఈ నెల 22లోపు సమర్పించాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ, ఇతర నియోజకవర్గాల ఆర్వోలు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వమే మద్యం అమ్ముతోంది

- మద్యపాన నిషేధం ఎక్కడ జగన్.. ?
- నాసిరకం మందుతో ప్రాణాలు పోతున్నాయ్
- కోడుమూరు సభలో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



మాట్లాడుతున్న షర్మిల

కోడుమూరు, ఏప్రిల్ 20: మద్యపాన నిషేధం అని రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వమే మద్యం అమ్ముతోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. 'ఏపీ న్యాయ్‌యాత్ర'లో భాగంగా ఆమె శనివారం కోడుమూరులో పర్యటించారు. ఈ సందర్భంగా కోడుమూరు కోట్ల సర్కిల్‌లో శనివారం జరిగిన బహిరంగ సభలో షర్మిల మాట్లాడారు. ఈ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యపాన నిషేధం చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడ పడితే అక్కడ మద్యం షాపులు ఏర్పాటు చేశాడని ధ్వజమెత్తారు. నాసిరకం మద్యం విక్రయిస్తూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారని చెప్పారు. బూమ్ బూమ్, క్యాపిటల్, స్పెషల్ స్టేటస్ అంటూ నాసిరకం మద్యం అమ్ముతూ మందుబాబుల ప్రాణాలను జగన్ హరిస్తున్నాడన్నారు. నాసిరకం మద్యం సేవించిన జనం ఎంతో మంది అనారోగ్యానికి గురై మృతి చెందారని గుర్తు చేశారు. నాసిరకం మద్యం సేవించి జనం చనిపోతుంటే వైసీపీ ప్రభుత్వం అవేమీ పట్టించుకోకుండా నాసిరకం మద్యాన్ని కొనసాగిస్తూనే ఉందన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పి జనం చేత ఓట్లు వేయించుకొన్న జగన్ ఇప్పుడు ఏం అయ్యాడని ప్రశ్నించారు. రైతుల కష్టాన్ని గాలికి వదిలేశాడని అన్నారు. రైతులకు సాగు నీరు తీసుకురావడంతో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కోడుమూరు ప్రజలకు తాగడానికి కూడా వైసీపీ ప్రభుత్వం నీళ్ల లేకుండా చేసిందన్నారు. కోడుమూరులో ఎమ్మెల్యే జనం ఇబ్బందులను పట్టించుకోలేదన్నారు. ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి ముఖ్యమంత్రి జగన్, వైసీపీ నాయకులు జనంలోకి వస్తున్నారు. ఓటును కొనేసి తిరిగి అధికారంలోకి రావాలని వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు. ఎవరు ఎంత డబ్బు ఇచ్చినా తీసుకొని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఆమె కోరారు. ఈ ఎన్నికల్లో ప్రజలు బాగా ఆలోచించి ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీకృష్ణ సీపీఐ, సీపీఎం నాయకులు గఫూర్‌మియా, రాజు తదితరులు పాల్గొన్నారు.

వీవీప్యాట్లతో ఓట్ల లెక్కింపు సులభతరం

తెలుసుకుందాం



నంద్యాల రూరల్, ఏప్రిల్ 20 : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది. విశిష్టమైన ఓటు హక్కు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు భారత ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు పలు సంస్కరణలు చేపడుతోంది. ఈ క్రమంలోనే 42 ఏళ్ల క్రితం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రారంభంలో ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన లేమి, సాంకేతిక సమస్యల వల్ల ఎన్నికల కమిషన్ అధికారులు ఇబ్బందులు పడ్డారు. అయితే బ్యాలెట్లపై వేసిన ఓట్లను లెక్కించడం కష్టమైన తరుణంలో ఈవీఎంల ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లోనే బ్యాలెట్ పద్ధతిని పాటిస్తుండగా, ఇతర అన్ని ఎన్నికలకు ఈవీఎంలను వినియోగిస్తున్నారు. 2013లో వీవీ ప్యాడ్ ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ అనే అత్యాధునిక యంత్రాన్ని తీసుకొచ్చారు. పోలింగ్ కేంద్రంలో ఓటు ఎవరికి పడిందో సరిచూసుకునే అవకాశం కల్పించారు.

ఈవీఎంలు ఎప్పుడు వినియోగిస్తారంటే

మీకు తెలుసా..



నంద్యాల రూరల్, ఏప్రిల్ 20: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ల స్థానంలో ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లను వినియోగిస్తున్న విషయం తెలిసిందే. ఒక నియోజకవర్గంలో 16 మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే రెండు ఈవీఎంలను వినియోగించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఒక ఈవీఎంలో 16 మంది వివరాలు మాత్రమే రికార్డు చేసేందుకు వీలుంటుంది. అంతకన్నా ఎక్కువ మంది బరిలో ఉంటే తప్పకుండా మరో ఈవీఎంలను వినియోగించాలి. 18 మంది అభ్యర్థులు రంగంలో ఉంటే మొదటి ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల వివరాలు, రెండో ఈవీఎంలో ఇద్దరి వివరాలు ఉంచుతారు. దీంతో పాటు ఏ పోలింగ్ బూత్‌లోనైనా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత మధ్యలో ఈవీఎం మొరాయిస్తే అప్పటి వరకు నమోదైన వివరాలను సీల్ చేసి, రెండో ఈవీఎంను వినియోగిస్తారు.

అసెంబ్లీ నియోజకవర్గాలకు గుర్తింపు సంఖ్యలు



నంద్యాల రూరల్, ఏప్రిల్ 20 : తరగతి గదిలో విద్యార్థులకు హాజరు పట్టికలో వరుస సంఖ్యలు ఉన్నట్లు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలకు కూడా వరుస సంఖ్యలు ఉన్నాయి. ఎన్నికల ప్రక్రియలో అసెంబ్లీ నియోజకవర్గానికి గుర్తింపు సంఖ్యలను కేటాయించారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 175 నియోజకవర్గాలు ఉండగా వాటికి ఎన్నికల సంఘం నంబర్లు కేటాయించింది. నంద్యాల జిల్లాలో 14 నియోజకవర్గాలు ఉండగా వాటికి ఎన్నికల సంఘం నంబర్లు ఈవిధంగా కేటాయించింది. నంద్యాలకు 139, ఆళ్లగడ్డ 144, శ్రీశైలం 135, నందికొట్కూరు 136, డోన్ 141, బనగానపల్లె 140, పాణ్యం 138 గుర్తింపు సంఖ్య కేటాయించారు.

గోడలపై ప్రచార రాతలు మాయం



అప్పట్లో అలా..

కోడుమూరు/చాగలమర్రి, ఏప్రిల్ 20: ఒకప్పుడు ఎన్నికలు వచ్చాయంటే ఇంటి యజమాని అనుమతి లేకుండా ఎక్కడ చూసినా గోడలపై అభ్యర్థుల పేర్లు, పార్టీ పేర్ల ప్రచారం రాతలను నింపేసే వాళ్లు. దీంతో ఇంటి యజమానులు ఇబ్బందులు పడేవారు. పదేళ్ల క్రితం వరకు ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఆయా పార్టీలు ఖాళీగా ఉన్న గోడలను రిజర్వు చేసుకునేవారు. పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడమే ఆలస్యం... వెంటనే ప్రచార రాతలతో గోడలను నింపేవారు. ఎన్నికల సమయంలో వివాహం వంటి శుభకార్యాలు ఉన్నా సరే ఇంటికి రంగులు వేయించుకునేందుకు యజమానులు వెనకాడేవారు. కానీ ప్రస్తుతం అంతామారిపోయింది. రంగురంగుల ఫ్లెక్సీల పుణ్యమా అంటూ నాటి గోడరాతలు మాయమయ్యాయి. దీంతో గోడలపై రాతలు రాసే ఆర్టిస్టులకు పనులు కరువయ్యాయి. సోషల్ మీడియాతో ప్రస్తుతం అభ్యర్థులకు ప్రచారం మరింత సులభమైంది. గతంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి ప్యాకెట్ బ్యాడ్జీలను వారి ఫొటోలతో తయారు చేయించడం వాటిని కార్యకర్తలు ధరించి ప్రచారం చేసేవారు. నేడు అవి కూడా కనిపించడం లేదు. ఎన్నికల ప్రచార సమయంలో నాటికి నేటికి ఎంతో వ్యత్యాసం కనిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో సోషల్ మీడియా టెక్నాలజీ విపరీతంగా వినియోగంలోకి రావడంతో మునుపటి ప్రచార రాతలు కనుమరుగయ్యాయి.

సమస్యలను ఇస్త్రీ చేస్తా

ఎన్నికల పాట్లు..



దుస్తులను ఇస్త్రీ చేస్తున్న నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య

నందికొట్కూరు, ఏప్రిల్ 19: ఎన్నికల వేళ అభ్యర్థుల పాట్లు అన్నీఇన్నీ కావు. గెలుపు కోసం చేయని ప్రయత్నాలంటూ లేవు. ఇందులోభాగంగానే శనివారం నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య నియోజకవర్గ కేంద్రంలో ప్రచారం చేపట్టారు. వీధివీధినా తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ క్రమంలోనే 21వ వార్డులోని ఓ రజక కుంటుంబం ఇంటికి వెళ్లాడు. ఆ కుటుంబ యజమాని బట్టలను ఇస్త్రీ చేస్తుండగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నాడు. అనంతరం అక్కడ ఉన్న చొక్కాను ఇస్త్రీ చేస్తూ తనను గెలిపిస్తే రజకులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఓటరు చేతిలో సాంకేతికత

ఎన్నికల సంఘం ప్రత్యేక చొరవతో వివిధ యాప్‌లు

ఓటరు, అభ్యర్థుల వివరాలు తెలుసుకోవడం సులభతరం

పారదర్శక ఎన్నికల నిర్వహణకు ఆధునిక పరిజ్ఞానం తోడ్పాటు

శిరివెళ్ల, ఏప్రిల్ 20 : దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సాంకేతికతను వినియోగిస్తోంది. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా, ప్రభుత్వ ఉద్యోగులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ రాజకీయ పార్టీలకు వత్తాసు పలికినా, అక్రమంగా తరలిపోతున్న నగదు, మద్యం రవాణాను నివారించేందుకు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల వివరాలు తెలుసుకునేందుకు వివిధ యాప్‌లు, వెబ్‌సైట్‌లతో పాటు పోర్టల్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమ రాజకీయ పార్టీల ప్రచారం, సభలు, సమావేశాలు, ప్రదర్శనల కోసం వీటి ద్వారానే అనుమతులు తీసుకునే వెసులుబాటును సైతం కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది.



● అభ్యర్థి గురించి ఇలా తెలుసుకోండి

మీ ప్రాంతంలోని అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో పోటీల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థుల గురించి తెలుసుకునేందుకు 'నో యువర్ క్యాండిడేట్, కేవైసీ' పేరుతో వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసింది. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు దాఖలు చేసే అఫిడవిట్‌లను ప్రజలు తెలుసుకునేలా ఎన్నికల సంఘం ఈ వెబ్‌సైట్‌ను రూపొందించింది. పోటీ చేస్తున్న అభ్యర్థి సమర్పించిన నామపత్రాల(అఫిడవిట్) ద్వారా వారి యొక్క స్థిర, చర ఆస్తులు, బంగారు ఆభరణాలు, గత నేర చరిత్ర ఏమైనా కలిగి ఉన్నారా తదితర వివరాలను ప్రజలు సులువుగా తెలుసుకోవచ్చు.



● ప్రజల చేతిలో ఆయుధం 'సీ విజిల్'

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టాలని చూసినా అక్రమంగా నగదు, డబ్బు తరలించే వారిపై నేరుగా ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం 'సీ విజిల్' అనే యాప్‌ను రూపొందించింది. ప్రజలు ఎవరైనా తమ స్మార్ట్ ఫోన్లలో ఈ యాప్‌ను ప్లే స్టోర్ లేదా ఎన్నికల సంఘం వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. క్షేత్రస్థాయిలో ప్రజలు గుర్తించే అక్రమాలను ఈ యాప్ ఫార్మాట్‌లో పొందుపరిచినట్లుగా ఫొటోలు, వీడియోల ద్వారా తమ ఫిర్యాదును నమోదు చేయవచ్చు. మీరు పంపిన సమాచారం ఆధారంగా అధికారులు వంద నిమిషాల వ్యవధిలో సంబంధిత ప్రదేశానికి చేరుకుని తగిన చర్యలు తీసుకోవడంతోపాటు వాటి వివరాలను ఫిర్యాదు చేసిన వ్యక్తి ఫోన్‌కు మెసేజ్ రూపంలో తెలియజేస్తారు. ఈ యాప్‌లో సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతారు.



● ఓటరు సమాచారం కోసం 'వీహెచ్ఏ'



ఓటర్ల సమాచారం సులువుగా తెలుసుకునేందుకు ఓటరు హెల్ప్‌లైన్ యాప్(వీహెచ్ఏ) పేరుతో ప్రత్యేక వ్యవస్థను ఎన్నికల సంఘం రూపొందించింది. ఓటు నమోదుతో పాటు ఓటరు జాబితాలు అందుబాటులో ఉంటాయి. తద్వారా జాబితాలో తమ పేర్లు ఉన్నాయా లేదా అని ఓటర్లు సులువుగా తెలుసుకోవచ్చు. దీంతో పాటు ఈ-ఎపిక్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

● వయో వృద్ధులు.. దివ్యాంగులకు 'సాక్ష్యం'



వయో వృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం ఎన్నికల సంఘం సాక్ష్యం యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పోలింగ్ కేంద్రానికి సొంతంగా చేరుకుని ఓటు హక్కు వినియోగించుకోలేని వ్యక్తులు తమ పేర్లను ఈ యాప్‌లో నమోదు చేసుకున్నట్లుయితే అధికారులు వారికి రవాణా సౌకర్యాన్ని కల్పిస్తారు. దివ్యాంగుల కోసం ట్రై సైకిల్‌ను ఏర్పాటు చేయడంతో పాటు వాలంటీర్‌ను సైతం అందుబాటులో ఉంచుతారు.

● ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా 'ఎన్జీఎస్'



ఓటర్లు ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు చేసేందుకు 'నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్'(ఎన్జీఎస్) పేరిట ఓ పోర్టల్‌ను రూపొందించింది. ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫిర్యాదులను ఇందులో నమోదు చేయవచ్చు. దేశవ్యాప్తంగా ఏ నియోజకవర్గానికి చెందిన ఫిర్యాదులనైనా ఇందులో నమోదు చేసే అవకాశం కల్పించారు. రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గ వివరాలను పొందుపరిస్తే సంబంధిత నియోజకవర్గ అధికారులు వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటారు.

చెరో ఆరు సార్లు

ఎంపీగా రికార్డు సాధించిన పెండేకంటి, కోట్ల

నంద్యాల టౌన్/ సంజమాల ఏప్రిల్ 20 : ఉమ్మడి మద్రాసు రాష్ట్రం ఉన్నప్పుడు ఉమ్మడి కర్నూలు జిల్లాకు రాజకీయంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రాంతంగా గుర్తింపు ఉండేది. 1952లో జిల్లాలో నంద్యాల లోక్‌సభ స్థానం, కర్నూలు లోక్‌సభ స్థానం ఏర్పాటయ్యాయి. 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కావడంతో జిల్లా కేంద్రమైన కర్నూలుతోపాటు నంద్యాల లోక్‌సభ స్థానాలకు ప్రాధాన్యత పెరిగింది. 1952లో మొదటిసారి పార్లమెంట్ ఎన్నికలు జరిగినప్పుడు నంద్యాల నుంచి రాయసం శేషగిరిరావు స్వతంత్ర అభ్యర్థిగా, కర్నూలు నుంచి హెచ్ సీతారామిరెడ్డి ఎంపీలుగా గెలుపొందారు. ఆ తర్వాత అప్పట్లో వివిధ కారణాలతో నంద్యాల నియోజకవర్గం రద్దు అయింది. నంద్యాల ఎంపీ పరిధిలోని పలు ప్రాంతాలను కర్నూలు, మార్కాపురం నియోజకవర్గాల్లో విలీనం చేశారు. దీంతో జిల్లాలో కర్నూలు, ఆదోని, మార్కాపురం పార్లమెంట్ స్థానాలు ఏర్పడ్డాయి. తిరిగి 1967లో ఎన్నికలు జరిగే నాటికి నంద్యాలను ప్రత్యేక పార్లమెంట్ నియోజకవర్గంగా ఏర్పాటు చేసి ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు అసెంబ్లీని నంద్యాలలోకి కలిపారు. ఆ తరువాత జరిగిన పునర్విభజనలో గిద్దలూరును నంద్యాల నుంచి వేరు చేసి ఒంగోలు పార్లమెంట్‌లో చేర్చారు.

ఆరు సార్లు ఎంపీగా పెండేకంటి వెంకటసుబ్బయ్య



పార్లమెంట్ సభ్యుడిగా ఆరు సార్లు ఎన్నికై దేశ రాజకీయాల్లో నంద్యాల ప్రాంత ఘనతను చాటిన రాజకీయ కురువృద్ధుడుగా పెండేకంటి వెంకటసుబ్బయ్య ఎన్నికల రికార్డు సాధించారు. జిల్లా పెద్దాయనగా కీర్తించబడుతున్న కోట్ల విజయభాస్కరరెడ్డితో సమానంగా జిల్లా నుంచి ఎంపీగా ఎన్నికైన వ్యక్తుల్లో ఒకరిగా నిలిచారు. కోవెలకుంట్ల తాలుకా సంజామలకు చెందిన పెండేకంటి వెంకటసుబ్బయ్య 1950వ దశకం నుంచి 1985 వరకు రాష్ట్ర రాజకీయాల్లో నంద్యాల కేంద్రంగా కాంగ్రెస్ నాయకుడిగా చక్రం తిప్పారు. 1952లో నంద్యాల లోక్‌సభ ఏర్పడిన తరువాత మొదటి ఎంపీగా స్వతంత్ర అభ్యర్థి రాయసం శేషగిరిరావు గెలిచారు. తదనంతరం నంద్యాల పార్లమెంట్ స్థానాన్ని రద్దు చేయడంతో కొత్తగా ఏర్పడిన ఆదోని స్థానం నుంచి పెండెకంటి వెంకటసుబ్బయ్య తన ప్రత్యర్థి వైజీ గౌడ్‌పై విజయం సాధించి తొలిసారిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టాడు. 1962లో కూడా ఆదోని ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన శంకర్‌రెడ్డిపై పెండేకంటి వెంకటసుబ్బయ్య రెండో సారి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1967 సంవత్సరంలో ఎన్నికలు జరిగే నాటికి తిరిగి నంద్యాల ప్రత్యేక పార్లమెంట్ నియోజక వర్గంగా అవతరించింది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో సీపీఐ, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన స్వామిరెడ్డి, యల్లారెడ్డిలపై పెండేకంటి వెంకటసుబ్బయ్య భారీ మెజార్టీతో గెలుపొంది ముచ్చటగా మూడోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. అలాగే 1971లో కాంగ్రెస్-ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన కానాల అంకిరెడ్డిపై గెలిచి నాలుగోసారి లోక్‌సభలో అడుగు పెట్టారు. 1978లో జరిగిన ఉప ఎన్నికలో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన గోమాంగోపై ఐదోసారి (ఈ ఉప ఎన్నిక 1977లో పెండేకంటిపై జనతా అభ్యర్థిగా నీలం సంజీవరెడ్డి ఎన్నిక కావడం, అనంతరం రాష్ట్రపతిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో జరిగింది.) ఐదో సారి విజయం సాధించారు. 1980లో కాంగ్రెస్ -యూ అభ్యర్థి ఆసీఫ్‌బాషాపై పెండేకంటి వెంకటసుబ్బయ్య విజయం సాధించి ఆరోసారి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై జిల్లా నుంచి అత్యధిక సార్లు పార్లమెంట్‌కు ఎన్నికైన ఇద్దరు నేతల్లో ఒకరిగా రాజకీయ ఘనత సాధించారు. దివంగత ఇందిరాగాంధీ ప్రభుత్వంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పని చేశారు. కాంగ్రెస్ పార్టీ పెండేకంటి సేవలను గుర్తించి 1985 తరువాత కర్ణాటక, ఒడిస్సా రాష్ట్రాలకు గవర్నర్‌గా అవకాశం కల్పించింది.

కర్నూలు నుంచి ఆరు సార్లు ఎంపీగా కోట్ల విజయభాస్కర్‌రెడ్డి



దేశ రాజకీయ చరిత్రలో కర్నూలు పార్లమెంట్‌కు విశిష్టమైన స్థానం ఉంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రరాష్ట్రం ఏర్పడటంతో కర్నూలును రాజధానిగా చేయడంతో మరింత ప్రాధాన్యత పెరిగింది. కాంగ్రెస్ పార్టీ కురువృద్ధుడిగా జిల్లా వాసులందరూ పెద్దాయనగా పిలుచుకునే కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఆరు సార్లు ఎంపీగా కర్నూలు నుంచి విజయం సాధించారు. 1977లో మొదటిసారి బీఎల్‌డీ అభ్యర్థి సోమప్పపై గెలిచి కోట్ల లోక్‌సభలో అడుగు పెట్టారు. 1980లో జనతా-ఎస్ అభ్యర్థి వెంకటస్వామి, జనతా అభ్యర్థి నజీర్ అహమ్మద్‌లపై రెండో సారి కోట్ల విజయం సాధించారు. 1989లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఏరాసు అయ్యపురెడ్డిపై విజయం సాధించి మూడోసారి కోట్ల గెలిచారు. 1991లో టీడీపీ అభ్యర్థి ఎస్‌వీ సుబ్బారెడ్డిపై విజయం సాధించి 4వ సారి లోక్‌సభకు కోట్ల ఎన్నికయ్యారు. 1996లో జరిగిన ఎన్నికలో మరో సారి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎస్‌వీ సుబ్బారెడ్డి, ఎన్‌టీఆర్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన డి.విష్ణువర్ధన్‌రెడ్డిలపై విజయం సాధించి ఐదో సారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1998లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కేఈ కృష్ణమూర్తిపై పోటీ చేసి ఆరోసారి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి లోక్‌సభకు ఎన్నికయ్యారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రిగా పని చేసిన కోట్ల రాష్ట్ర ముఖ్యమంత్రిగా కూడా రెండు సార్లు పదవులు అలంకరించారు.

జంప్ జిలానీల ఝలక్‌లు

పైసల కోసం లీకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 20: శ్రీశైల నియోజకవర్గంలో ఎన్నికల వేడి రసవత్తరంగా మారింది. ఇటీవల కాలంలో టీడీపీలోకి భారీగా చేరికలు ఉండడంతో కట్టడి చేసేందుకు అధికార వైసీపీ చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఇన్ని కావు. అసంతృప్తితో ఫలానా నాయకుడు పార్టీ వీడుతున్నట్లు సమాచారం రాగానే ఆయన వద్దకు బతిమిలాడి, ప్రలోభాలకు గురిచేసినప్పటికీ ఫలించడం లేదు. ఇదే అదునుగా వైసీపీకి చెందిన కొందరు చోటా మోటా నాయకులు తాము పార్టీ వీడుతున్నట్లు ఆ పార్టీ అధినాయకుడికి లీకులు ఇస్తున్నారు. ఆ వెంటనే ముఖ్యనాయకులు రంగ ప్రవేశం చేసి కొంత ప్యాకేజీ ముట్టజెప్పి పార్టీలోనే కొనసాగేలా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే అలా లీకులు ఇచ్చి చాలా మంది నాయకులు రూ.లక్షల్లో ప్యాకేజీలు పొందినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే ఇటీవల ఓ వైసీపీ నాయకుడు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో సంప్రదింపులు జరిపారు. తాను వైసీపీని వీడి తిరిగి టీడీపీలోకి వస్తానని, గతంలో తనకు ఉన్న పదవిని ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఈ విషయం కాస్త ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దృష్టికి వెళ్లడంతో కొంత ప్యాకేజీ ఫిక్స్ చేసి అదే నాయకుడిచే తాను పార్టీ వీడడం లేదని, అవన్ని పుకార్లంటూ ప్రకటింపజేశారు. కొంత మంది వైసీపీ కౌన్సిలర్లు కూడా పార్టీ వీడేందుకు సిద్ధమవగా ఒక్కొక్కరికి రూ.2.5 లక్షలు ఇచ్చి నిలుపుదల చేసుకున్నట్లు ఆత్మకూరులో ప్రచారం జరుగుతోంది.

చీటీ లేకున్నా వివరాలు తెలుసుకోవచ్చు

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 20: ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌కు వెళ్లే ముందు ఓటర్లందరూ సహజంగా పోల్ చీటీల కోసం ఇళ్లంతా వెతుకుతుండటం సర్వసాధారణం. బీఎల్వోలు పంపిణీ చేసిన చీటీలను సక్రమంగా భద్రపరుచుకుంటే చిక్కులేమి ఉండవు. కానీ నిర్లక్ష్యం చూపి మరిచిపోతేనే తాత్కాలిక అశాంతి ఎదుర్కోవాల్సి వస్తుంది. మరికొందరు పోల్ చీటి లేకుంటే ఓటు వేయరాదేమోననే అవగాహన రాహిత్యంతో పోలింగ్ కేంద్రానికి వెళ్లరు. అయితే అటువంటి వారు ఓటును వేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పిస్తోంది. ప్రతి పోలింగ్ బూత్ వెలుపల ఎన్నికల విధుల్లో ఉండే బీఎల్వోలను వాకబు చేస్తే ఓటరు జాబితాలోని క్రమ సంఖ్య తదితర వివరాలను తెలియజేస్తారు. ఆ వెంటనే పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు వేయవచ్చు లేదా యాప్ ద్వారా ఓటరు హెల్ప్‌లైన్ యాప్ మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడు చేసుకుని పోలింగ్ బూత్, క్రమ సంఖ్య తదితర వివరాలు తెలుసుకొని పోలింగ్ కేంద్రానికి వెళ్లొచ్చు. అయితే.. పోల్ చీటీలను భద్రపరచడంలో మాత్రం జాగ్రత్తగా వ్యవహరిస్తే ఓటింగ్ ముందు హైరానా పడాల్సిన పరిస్థితి తప్పుతుంది.

బీసీ ఆస్తులు, అప్పుల ఇవే..



బనగానపల్లె, ఏప్రిల్ 20 : బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్తులు అప్పుల వివరాలను అఫిడవిట్‌లో వివరించారు. బీసీ జనార్ధన్‌రెడ్డి చరాస్తులు రూ. 52 కోట్ల, 22 లక్షల, 69వేల 953లుగా చూపారు. ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ చరాస్తులు రూ.5, కోట్ల 89, లక్షల 2వేల 337లుగా చూపారు. బీసీ జనార్ధన్‌రెడ్డి స్థిరాస్తులు రూ.90కోట్ల 29 లక్షల, 62వేల 896లుగా చూపారు. బీసీ ఇందిరమ్మ స్థిరాస్తులు రూ.3 కోట్ల 50లక్షల, 35వేల 173లుగా చూపారు. అలాగే బీసీ జనార్ధన్‌రెడ్డికి గల అప్పులు రూ.16 కోట్ల 95లక్షల, 47వేల 300లుగా చూపారు. బీసీ ఇందిరమ్మ అప్పులు రూ.6 కోట్ల 40లక్షల, 62వేల 404గా చూపారు.

ఆదోని హ్యాట్రిక్ వీరులు





ఆదోని టౌన్, ఏప్రిల్ 20: ఆదోని అసెంబ్లీకు ఇంతవరకు 14 సార్లు ఎన్నిక లు జరిగాయి. అందులో ఇద్దరు నాయకులు ముచ్చటగా మూడు సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ వీరులుగా నిలిచారు.

● ప్రస్తుత టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మొదటిసారి 1994లో టీడీపీ నుంచి ప్రత్యర్థి రాచోటి రామయ్య (కాంగ్రెస్)పై 16,581 మెజారిటీతో గెలిచారు. రెండోసారి 1999లో టీడీపీ నుంచి ప్రత్యర్థి కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి (కాంగ్రెస్)పై 14,428 ఓట్ల మెజారిటీతో గెలిచారు. మూడో సారి 2009లో టీడీపీ నుంచి ప్రత్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యేగా ఉన్న సాయిప్రసాద్ రెడ్డి (కాంగ్రెస్‌పై 256 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు.

● ఆదోనిలో రెండో సారి హ్యాట్రిక్ సాధించిన ఘనత ప్రస్తుత ఎమ్మెల్యే వైఎస్ సాయిప్రసాద్ రెడ్డికే దక్కింది. ఈయన 2004లో కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రత్యర్థి గుడిసె కృష్ణమ్మ (తెలుగుదేశం) పై 24,741 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రెండో సారి 2014లో వైసీపీ తరుపున ప్రత్యర్థి కే మీనాక్షినాయుడు (తెలుగుదేశం) పై 16,831 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మూడోసారి 2019లో వైసీపీ తరుపున ప్రత్యర్థి కే మీనాక్షినాయుడు (తెలుగుదేశం)పై 12,319 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి హ్యాట్రిక్ సాధించారు.

● హ్యాట్రిక్ మిస్ చేసుకున్న ఆ ఇద్దరు

1985, 1989లో రాచోటి రామయ్య కాంగ్రెస్ పార్టీ తరుపున ఎమ్మెల్యేగా గెలిచినా, మూడోసారి 1994లో ప్రత్యర్థి మీనాక్షినాయుడు (తెలుగుదేశం) చేతిలో ఓడిపోయి రాజకీయాలకు పూర్తిగా స్వస్తి పలికారు. 1972, 1978లలో కాంగ్రెస్ పార్టీ తరుపున హెచ్ సత్యనారాయణ శాసనసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అయితే 1983లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ప్రకాష్‌జైన్ చేతిలో ఓటమిపాలై ఆయన కూడా రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగారు.

నేటి నుంచి ఆంజనేయ స్వామి ఉత్సవాలు ప్రారంభం

సి.బెళగల్, ఏప్రిల్ 20: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో వెలసిన పడమర ఆంజనేయ స్వామి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ నిర్వాహకుడు మద్దయ్య స్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 21న ఆదివారం గణపతి పూజ, 22న అగ్ని ప్రతిష్ఠార్పణ హోమం, 23న ఆంజనేయస్వామికి అభిషేకం, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

న్యాయ యాత్రను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు బాబురావు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 20: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం కర్నూలులో తలపెట్టిన న్యాయ యాత్రను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే బాబురావు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఆదివారం కర్నూలు నగరంలో ఉదయం 10 గంటలకు యాత్ర బళ్లారి చౌరస్తా, కొత్తబస్టాండ్, శ్రీరామటాకీస్, కొండారెడ్డి బురుజు, పాతబస్టాండ్, కింగ్ మార్కెట్, గడియారం ఆస్పత్రి, చౌక్ ప్రాంతాల్లో బహిరంగ సభ ఉంటుందని, అక్కడ నుంచి ర్యాలీగా పూలబజారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్, కుమ్మరి వీధీ, నాలుగు రస్తాలు, జమ్మి చెట్టు, జోహరాపురం మీదుగా నంద్యాల జిల్లాలోకి న్యాయ యాత్ర ప్రవేశిస్తుందని తెలిపారు. ఈ సమావేశం లో డీసీసీ ఉపాధ్యక్షుడు బీ.బతు కన్న, పీజీ నరసింహులు యాదవ్, ఉండవల్లి వెంకటన్న, అనంతరత్నం మాదిగ, కే. సత్యనారాయణ గుప్త, లాజరస్, ప్రమీల,వెంకట సుజాత, లలిత, రీయాజుద్దీన్, షేక్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు ప్రవేశ పరీక్ష

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 20: జిల్లాలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని డీఈవో శ్యామూల్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్‌ను డౌన్‌లోడు చేసుకుని పరీక్షకు హాజరు కావాలన్నారు. ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకో వాలన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్, బ్లూ, బ్లాక్ పెన్ను, పరీక్ష ప్యాడ్‌తో హాజరు కావాలన్నారు. జిల్లాలో 16 ఆదర్శ పాఠశాలల్లో 1600 సీట్లు అందుబాటులో ఉన్నాయని, 3923 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు


ఎస్.కొంతలపాడులో కేక్ కట్ చేస్తున్న గౌరు చరిత


గూడూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 20: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహిం చారు. మండలంలోని ఎస్.కొంతలపాడు గ్రామంలో పాణ్యం టీడీపీ అభ్యర్థి, గౌరు చరిత కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ చంద్రబాబు ఆయురారోగ్యాలతో ఉండాలని, అలాగే ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టాలని భగవంతుడిని ప్రార్థించారు. కోరారు. కార్యక్ర మంలో నాయకులు గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మణ్‌రావు, చదువుల సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గూడూరు: గూడూరులో చంద్రబాబు జనదినాన్ని పురస్కరించుకొని టీడీపీ నాయకుడు, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాం జనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దండు సుందర రాజు, రేమట వెంకటేష్, డాక్టర్ మన్నన్ బాషా, సుమన్ బాబు, నాగప్ప యాదవ్, పౌలు, తెలుగు శ్రీను, కౌన్సిలర్ కోడుమూరు షాషావలి, మునగాల గోపాల్ పాల్గొన్నారు.

టీడీపీతోనే యువత భవిష్యత్తు

పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత

ఓర్వకల్లు, ఏప్రిల్ 20: తెలుగుదేశం పార్టీతోనే యువతకు భవిష్యత్తు ఉంటుందని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. శనివారం మండలంలోని గుట్టపాడు, ఎన్.కొంతలపాడు, ఉప్పలపాడు గ్రామాల్లో ఆమె నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడ మల్లెల రాజశేఖర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్లలో రాష్ట్రం 30 ఏళ్ల అభివృద్ధిలో వెనుకేసిందన్నారు. ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన ప్రతి రైతుకు అధికారంలోకి వచ్చిన వెంటనే నష్టపరిహారం ఇప్పిస్తామన్నారు. చంద్ర బాబు హయాంలో డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి ఆర్థికంగా అభివృద్ధి చేశార న్నారు. జగన్ పాలనలో డ్వాక్రా సంఘాలు మూలనపడ్డాయన్నారు. చంద్రబాబు హయాంలో సోలార్, డీఆర్‌డీవో, ఉక్కు పరిశ్రమ, విమానాశ్రయం ఏర్పాటు చేశారని, అయితే ఆ పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వలేద న్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామ న్నారు. ఉప్పలపాడు గ్రామంలో వైసీపీకి చెందిన సుధాకర్, రంగస్వామితోపాటు పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, చదువుల సుధాకర్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, చంద్ర పెద్దస్వామి, వెంకటరమణ పాల్గొన్నారు.

కల్లూరు: తెలుగుదేశం పార్టీ సూపర్‌సిక్స్ పథకాలే రాష్ట్ర ప్రజలకు శ్రీరామరక్ష అని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 34వ వార్డు కృష్ణారెడ్డినగర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఇంటింటికి తిరిగి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి కూల్చివేతలతో పాలన ప్రారంభించి రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తూ 20 ఏళ్ళు వెనక్కి తీసుకెళ్ళారని ఆరోపించారు. అనంతరం చంద్రబాబు జన్మదిన వేడుకల్లో భాగంగా టీడీపీ జిల్లా కోశాధికారి పీయూ మాదన్న ఆధ్వర్యంలో గౌరు చరిత కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో డీవీ చంద్ర, నవీన్, భాస్కర్‌గౌడ్, బీసన్న, రంగప్ప, తులసీక్రిష్ణ, మహేష్, శివ, జే.గంగాధర్‌గౌడ్, మదన్‌మోహనాచారి పాల్గొన్నారు.


34వ వార్డు కృష్ణారెడ్డినగర్‌లో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న గౌరు చరిత

జోహరాపురాన్ని అభివృద్ధి చేస్తా: టీజీ భరత్


భరోసా యాత్రలో మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్),ఏప్రిల్ 20: జోహరాపురాన్ని అభివృద్ధి చేస్తానని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీ జీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని జోహరాపురంలో టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. స్థానికులు రోడ్లు, మురుగు కాలువలు విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీని గెలిపిస్తే మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎక్కువ నిధులు జోహరాపురానికి కేటాయిస్తానన్నారు. కార్యక్రమంలో 17 వార్డు కార్పొరేటర్ పద్మాలతారెడ్డి, జనసేన ఇన్‌చార్జి అర్షద్, టీడీపీ నాయకులు బాబ్జీ, వినోద్ చౌదరీ, చంద్రమోహన్, మల్లి గౌడ్, ప్రమోద్, ఆనంద్, మద్దయ్య, అబ్రహం, ఫయాజ్ పాల్గొన్నారు.

మెడికవర్‌లో అరుదైన శస్త్ర చికిత్స


రోగితో మెడికవర్ హాస్పిటల్ వైద్యులు నాగసురేష్, విశ్వకుమార్

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 20: డోన్ ప్రాంతానికి చెందిన ఓ రోగికి రెండు సర్జరీలు నిర్వహించి కర్నూలు మెడికవర్ హాస్పిటల్ వైద్యులు రోగి ప్రాణాలను కాపాడారు. 23 ఏళ్ల రాజశేఖర్ అమకతాడు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమా దంలో గాయపడి తలకు తీవ్ర గాయమైంది. ఎంఆర్ఐ పరీక్ష అనంతరం తల పూర్తిగా దెబ్బతిన్నట్లు నిర్ధారణ కావడంతో అతనికి న్యూరాలజిస్టు ఎం.నాగ సురేష్, న్యూరోసర్జన్ విశ్వకుమార్ బృందం ఫ్రంటోడెంపోరల్ క్రానియేటమి స్టెరియన్ సర్జరీని నిర్వహించారు. ఏప్రిల్ 17న బ్రెయిన్ ఫీవర్‌తో బాధపడుతూ అడ్మిషన్ అయ్యారు. ఈ జ్వరం మెదడుకు సోకడంతో అపస్మారక స్థితికి వెళ్లారు. ఈ ఇద్దరు వైద్యులు మళ్లీ రోగికి రక్తం, సీఎస్ఎఫ్ ద్రవం కారుతున్నట్లు నిర్ధారించి శస్త్ర చికిత్స చేసి రోగి ప్రాణాన్ని కాపాడారు. శస్త్ర చికిత్సను చేసిన వైద్యులను మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడద్ది అభినందించారు.

రాజవర్ధన్‌రెడ్డికి నివాళి


రాజవర్ధన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 20: కర్నూలు మండలం మాజీ ఎంపీపీ, టీడీపీ యువనేత దివంగత రాజవర్ధన్‌రెడ్డి ద్వితీయ వర్ధంతిని విష్ణుసేనా ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి తన కుమారుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిలు రాజవర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాజవర్ధన్‌రెడ్డికి నివాళి అర్పించిన వారిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, అహ్మద్ అలీఖాన్, జనసేన నాయకులు అర్షద్, రాంబాబు, బి.తాండ్రపాడు సర్పంచు ఆకెపోగు జయ్యన్న ఉన్నారు.

● రాజవర్ధన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా పసుపుల గ్రామంలోని అక్షయ భవన్ అనాథ ఆశ్రమంలో బొగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో అనాథశ్రమ నిర్వాహకులకు నిత్యావసర సరుకులు అందజేశారు. అంతకముందు రాజవర్ధన్‌రెడ్డి చిత్రపటానికి, సి.బెళగల్ మండలం జడ్పీటీసీ గిరిజోన్, దిన్నెదేవరపాడు గ్రామ సర్పంచు ఎం. మాధవస్వామితో కలిసి దస్తగిరి నివాళర్పించారు. శంకర్, భాస్కర్, వనుములన్న, సుంకన్న పాల్గొన్నారు.

● బి.తాండ్రపాడు గ్రామంలో ఎంపీటీసీ కురువ మద్దిలేటి ఆధ్వర్యంలో బీసీ కాలనీలో ప్రజలకు 200 ప్యాకెట్లు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అంతక ముందు రాజవర్దన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచు చాంద్‌బాషా, మాజీ సర్పంచు శ్రీనివాసగౌడ్, మాజీ ఎంపీటీసీ మాదన్న, మాజీ ఎంపీటీసీ బోయ రామకృష్ణ, మత్తయ్య, మోహన్, వార్డు సభ్యుడు విజయుడు, పి.ప్రసాద్, జనసేన నాయకులు కుమార్ పాల్గొన్నారు.

● స్టాంటన్‌పురంలో టీడీపీ యువజన నాయకుడు కురువ మధు ఆధ్వర్యంలో రాజవర్ధన్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. నాయకులు రాచపూడి సుమియేన్, మాజీ సర్పంచు మార్కండేయులు, వీరభద్రి, భీసన్న పాల్గొన్నారు.

● ఆర్.కొంతలపాడు, గార్గేయపురం, పంచలింగాల, ఇ.తాండ్రపాడు, గొందిపర్ల, కోడుమూరులలో విష్ణుసేన ఆధ్వర్యంలో అభిమానులు, నాయకులు రాజవర్ధన్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు.

గూడూరు: గూడూరులో మాజీ ఎంపీపీ దివంగత రాజవర్ధన్ రెడ్డి రెండో వర్ధంతిని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. శనివారం గూడూరులో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో రాజావర్ధన్‌రెడ్డిని చిత్రపటానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు దండు సుందరరాజు, రేమట వెంకటేష్, డాక్టర్ మన్నన్ బాషా, సుమన్ బాబు, నాగప్ప యాదవ్, పౌలు, తెలుగు శ్రీను, కౌన్సిలర్ కోడుమూరు షాషావలి, మునగాల గోపాల్ పాల్గొన్నారు.

సి.బెళగల్: కర్నూలు మండల మాజీ ఎంపీపీ రాజవర్ధన్‌రెడ్డి రెండో వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, ఎంపీటీసీ ఈరన్నగౌడు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటప్ప, బాలాజీ వెంకటేశ్, పౌలు, ఈర్లదిన్నె శేషన్న, కొత్తకోట హరి, దూద్‌వలి, రత్నం, బీమన్న పాల్గొన్నారు.


పూలమాలు అర్పించి నివాళర్పిస్తున్న బస్తిపాటి నాగరాజు, దస్తగిరి

ఉద్యోగులకు నోటీసులు

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 20: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సమయపాలన పాటించని ఉద్యోగులకు సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి నోటీసులిచ్చారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ఆయన చాంబరుకు వచ్చారు. అత్యవసర పని కోసం ఆఫీసులోని ఇద్దరు క్లర్కులను రమ్మని సూపరింటెండెంట్ ఆదేశించారు. ఆ సమయంలో విధుల్లో ఆ ఇద్దరు క్లర్కులు లేకపోవడంతో సూపరింటెండెంట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 10.40 గంటలకు సూపరింటెండెంట్ ఆఫీసును తనిఖీ చేశారు. ఆ సమయంలో 15 మంది తమ సీట్లలో లేకపోవడంపై సూపరింటెండెంట్ అసహనం వ్యక్తం చేశారు. బయోమెట్రి ఉన్న ఎవరూ సమయపాలన పాటించడం లేదని మండిపడ్డారు. ఉదయం 10.30 గంటలకు వచ్చిన 15 మంది సీనియర్ జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బందికి మెమోలు జారీ చేయాలని ఆఫీసు సూపరింటెండెంట్ కుమారస్వామిని ఆయన ఆదేశించారు.

మ్యాపింగ్ సమస్యతో సతమతం

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 20: జిల్లాలోని ఉపాధ్యాయులు, జీతాల బిల్లులు సబ్మిట్ చేసే సమయంలో మ్యాపింగ్ సమస్యతో ఉద్యోగులు సతమతమవుతున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఏటీవో జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సహా య అధ్యక్షులు హేమంత్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, కర్నూలు మండల కార్యదర్శి సోమన్న పాల్గొన్నారు.

పరీక్షల నమోదును సరళీకృతం చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 20: విద్యార్థుల పరీక్షల మార్కుల నమోదును సరళీకృతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. శనివారం డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామూల్‌ను ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈనెల 23వ తేదీలోపు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్న చోట వివరాలు నమోదు చేయడం సాధ్యమైన పని కాదన్నారు. డీఈవోను కలిసిన వారిలో ఫ్యాప్టో చైర్మన్ ఎస్. గోకారి, జనరల్ సెక్రటరీ తిమ్మప్ప, ఏపీటీఎఫ్ (257) ఎం.రంగన్న, ఏపీటీఎఫ్ (1939) మరియానందం, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ఆప్టా జిల్లా అధ్యక్షుడు శివనాయక్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ పాల్గొన్నారు.

'జగన్‌రెడ్డిని ఓడిస్తాం'

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 20: ఎస్సీ కార్పొరేషన్ నిధులను నిర్వీర్యం చేసిన జగన్మోహన్‌రెడ్డిని సార్వత్రిక ఎన్నికల్లో ఓడిస్తామని మాల సంఘం జేఏసీ నాయకులు ఎనుముల రాజకుమార్ అన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల 27 సంక్షేమ పథకాలను అటకెక్కించిన జగన్‌రెడ్డిని, అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. దళితులపై వైసీపీ నాయకులు దాడులు చేస్తున్నా.. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో దళిత నాయ కులు ఈటె జములయ్య, కుమ్మరి రత్న స్వామి, కందుకూరి విజయలక్ష్మి, జగన్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్‌జీఎఫ్ రగ్బీ అండర్-19 జట్టు ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), ఏప్రిల్ 20: మహారాష్ట్రాలోని పూణేలో ఈ నెల 23, 24 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 రగ్బీ పోటీలకు వెళ్లే రాష్ట్ర జట్టును ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మయ్య ప్రకటించారు. శనివారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో డీఈవో శ్యాముల్ క్రీడాకారులను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించాలని కోరారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో ఆయన పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతి, స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జోసెఫ్ లక్ష్మయ్య, రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **బాలికల జట్టు:** అశ్విత, గ్రీష్మశ్రీ, సహస్ర (గుంటూరు), సాయిప్రియ శృతి, జీవన (కర్నూలు), లోహిత, వీణ (అనంతపురం), రుక్షాన (వెస్ట్ గోదావరి) శ్రీలక్ష్మి, చారుమతి (చిత్తూరు), రోహిణి (ఈస్ట్ గోదావరి), చంద్రిక (నెల్లూరు), జట్టు కోచ్‌గా గుంటూరు చెందిన జ్యోతి ఉన్నారు.

● **బాలుర జట్టు:** కే.మహిధర్, ఎం.సంతోష్, శ్రావణ్ కుమార్ (నెల్లూరు), సుమంత్, మనోహర్, సింహాద్రి (కర్నూలు), సుధీర్ కుమార్ (ఈస్ట్ గోదావరి), అభయ ప్రసాద్ (గుంటూరు) దుర్గాప్రసాద్ (వెస్ట్ గోదావరి), నాగ చైతన్య (ప్రకాశం), హర్షవర్ధన్ (శ్రీకాకుళం) జట్టు కోచ్‌గా గుంటూరు చెందిన సుమంత్ వ్యవహరిస్తున్నారు.

ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులను గెలిపించాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్


మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 20: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మౌర్యఇన్‌లో బీజేపీ బూత్ స్థాయి కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీతోనే దేశ అభివృద్ధి సాధ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం 80 కోట్ల మంది పేద ప్రజలకు రేషన్ పంపిణీ చేస్తోందన్నారు. అలాగే రాష్ట్రంలోని పేదలకు 5 లక్షలకు పైగా ఇళ్లు మంజూరు చేసి నిర్మిస్తుందని తెలిపారు. దేశంలో ఎన్నో సంస్కరణలు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకు వచ్చిందని వివరించారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ముస్లింలకు వ్యతిరేకం కాదన్నారు. అన్ని మతాలు, కులాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పథకాలను మంజూరు చేస్తోందని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి అంకిత భావంతో పని చేయాలని బీజేపీ నాయకులను, కార్యకర్తలను కోరారు. కర్నూలు పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు బీజేపీ క్యాడర్ కృషి చేయాలన్నారు. బీజేపీ జిల్లా ఇన్‌చార్జి అంకాల్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థులతోపాటు ఆదోనిలో కూటమి అభ్యర్థి పార్థసారథిని గెలిపించేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు కూటమి ధర్మాన్ని పాటించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కె.కపిలేశ్వరయ్య, మాజీ జిల్లా అధ్యక్షులు రామస్వామి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్, కర్నూలు నియోజకవర్గం కన్వీనర్ సూర్యప్రకాష్, బీజేపీ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 20: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రాజెక్టు జిల్లా మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం కర్నూలు మండలంలోని దిన్నెదేవరపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ ప్రకృతి వ్యవసాయంతో వచ్చే లాభాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సందీప్‌కుమార్, మార్కెటింగ్ అసోసియేట్ మల్లికార్జున, ఆంజనేయులు, మెంటర్ నరసింహులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి పరికరాలు విరాళం

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 20: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ వైద్య పరికరాలను విరాళంగా అందించింది. రూ.లక్ష విలువ చేసే ఒక సెక్షన్ ఆపరేటర్, 15 స్టాండింగ్ డైమండ్ బీపీ ఆపరేటర్లను కామినేని హాస్పిటల్ సీఈవో డా.ఎస్వీ చంద్రశేఖర్, ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డికి అందజేశారు. కార్పొరేటర్ రెస్పాన్సిబిలిటీ కింద పరికరాలను కర్నూలు జీజీహెచ్‌కు అందించిన జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌కు ఆసుపత్రి సూపరింటెండెంట్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, కామినేని హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గణేష్, హాస్పిటల్ జనరల్ మేనేజర్ నదీమ్ పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియపై ఆర్వో సమీక్ష

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 20: కర్నూలు అసెంబ్లీ నియోజకర్గ ఆర్‌ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ శనివారం ఆయన కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సెక్టోరల్ అధికారులు, స్పెషల్ అధికారులు, కార్పొరేషన్ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియకై ముందస్తు ఏర్పాట్లను ఆయన సమీక్షిం చారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

టీడీపీతోనే మాదిగలకు న్యాయం

మద్దికెర, ఏప్రిల్ 20: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీడీపీతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు బండెల ఆనంద్ కుమార్, మండల మాదిగ యువసేన అధ్యక్షుడు రాంబాబు మాదిగ అన్నారు. శనివారం ఎం.అగ్రహారం ఎరవలి గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శనివారం కర్నూలులో జరుగుతున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశానికి వెళ్తూ మద్దికెరలో వారు విలేకరులతో మాట్లాడుతూ మందకృష్ణ సూచన మేరకు టీడీపీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని పేర్కొన్నారు.

విద్యుదాఘాతానికి గురై దినసరి కూలీ మృతి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 20: విద్యుదాఘాతానికి గురై ఓ దినసరి కూలీ మృతి చెందిన సంఘటన శనివారం పత్తికొండ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక రామకృష్ణారెడ్డి నగర్‌లో తాయప్ప (36), ఆయన భార్య కమల, ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి తన ఇంటి మిద్దెపైన వర్షపు నీరు నిల్వ ఉండటంతో శనివారం ఉదయాన్నే ఇంటి మిద్దెపైకి ఎక్కాడు. వర్షపు నీటిని కిందకు పంపించే క్రమంలో మిద్దెపైనున్న ఇనుప కడ్డీలకు విద్యుత్ సరఫరా ఉండటంతో షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను ప్రభుత్వాసుపత్రికి తరలించేలోపు అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశుగ్రాసానికి నిప్పు

మద్దికెర, ఏప్రిల్ 20: రైతులు ఎద్దుల కోసం నిల్వ ఉంచుకున్న పశుగ్రాసానికి గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టారు. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లింది. మద్దికెర గ్రామానికి చెందిన రైతులు సుధాకర్, వీరేష్ గ్రామ శివారు జగనన్న కాలనీ సమీపాన ఉన్న తమ బైలు స్థలంలో రూ.1.50 లక్షలు విలువ చేసే పశుగ్రాసాన్ని నిల్వగా ఉంచుకున్నారు. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు నిప్పంటించడంతో మొత్తం కాలి బూడిదయ్యింది. ఎవరో కావాలనే కక్ష కట్టి గడ్డివాములను దగ్ధం చేశారని, గతంలో కూడా ఇదే రైతుకు చెందిన కంది పంటను కూడా కోసేశారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులు ఎస్‌ఐ రమేష్‌బాబుకు, తహసీల్దార్ రజాక్‌వలికి ఫిర్యాదు చేశారు.

టీడీపీని గెలిపించుకుందాం: బీసీ సెల్

నందవరం, ఏప్రిల్20: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముగతి ఈరన్నగౌడు, జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయిమాధవరావు అన్నారు. శనివారం ఇబ్రహింపురం గ్రామంలో టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రచారం చేశారు. వైసీపీ అంతిమ గడియలు దగ్గర పడ్డాయని, వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ప్రతి బీసీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. టీడీపీ నాయకులు రూప జగదీష్, గురురాజారావు, నాగరాజుగౌడు, కాశీంవలి, రైస్‌మిల్ నారాయణరెడ్డి, దర్మాపురం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భయపెట్టి జనాలను తరలిస్తారా..?

మద్దికెర, ఏప్రిల్ 20: పత్తికొండ వైసీపీ అభ్యర్థి నామినేషన్‌కు మండల వైసీపీ నాయకులు ఉపాధి కూలీలను భయపెట్టి తరలించారని టీడీపీ జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అన్నారు. శనివారం మాజీ ఎంపీపీ పద్మావతి స్వగృహంలో విలేకరులతో మాట్లాడరాట. ఉపాధి కూలీలను నామినేషన్ల కార్యక్రమాలకు రాకపోతే మస్టర్లు ఇచ్చేది లేదంటూ భయపెట్టారని ఆరోపించారు. ఉపాధి కూలీలందరినీ తీసుకు రావాలని, లేకపోతే.. చర్యలు తీసుకుంటామని మేటీలను హెచ్చరించారని పేర్కొన్నారు.

మఠానికి రూ.2లక్షల విరాళం

మంత్రాలయం, ఏప్రిల్ 20: రాఘవేంద్రస్వామి మఠానికి తమిళనాడు లోని తిరుమలైకు చెందిన వెంకటేశన్ అనే భక్తుడు రూ.2లక్షలు సంపూర్ణ సేవకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషీలు తెలిపారు. శనివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.2 లక్షలు నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబ సభ్యులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమొంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

ఉరుకుంద ఆలయ కాంట్రాక్టు ఉద్యోగి భార్యకు

కోసిగి/కౌతాళం, ఏప్రిల్ 20: ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి దేవస్థానంలో కాంట్రాక్టు ఉద్యోగి నిబంధనలు తుంగలో తొక్కి.. ఆలయంలో జరిగిన వేలం పాటల్లో తన భార్యకు రెండు టెండర్లు దక్కించుకున్నారు. ఇదంతా అధికారులకు తెలిసే జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 19న శుక్రవారం ఉదయం 11 గంటలకు దేవస్థానానికి సంబంధించి వివిధ టెండర్లను నిర్వహించారు. ఇందులో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్న పి.లక్ష్మీనాథ్ రెడ్డి భార్య పి.లక్ష్మి వంట చెరుకు సప్లయ్ చేయడానికి టింబర్ డిపో లేకపోయినా ఆ టెండరు దక్కించుకోవడం గమనార్హం. అలాగే ఈ క్లాతింగ్ మెటీరియల్ టెండర్‌ను కూడా కాంట్రాక్టు ఉద్యోగి లక్ష్మీనాథ్ రెడ్డి భార్య లక్ష్మీ కైవసం చేసుకుంది. ఆలయంలో పని చేసే ఉద్యోగులు, వారి బంధువులు వేలం పాటలో పాల్గొనరాదన్న నిబంధనలు ఉన్నాయి. ఈవో దగ్గర అటెండరుగా పని చేస్తుండటం అధికార పార్టీ నాయకులతో సంబంధాల కారణంగా టెండర్లు దక్కించుకున్నట్లు తెలుస్తోంది.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



మంత్రాలయంలో కేక్ కట్ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి



ఆలూరు, గోనెగండ్లలో చంద్రబాబు జన్మదిన సంబరాల్లో పార్టీ శ్రేణులు



చంద్రబాబు జన్మదినం సందర్భంగా మద్దికెరలో పూజలు, నందవరంలో సంబరాలు

టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు కేకులు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నాయి. ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు స్వగృహంలో కేక్ కట్ చేసి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పార్థసారథికి తినిపించారు. అలాగే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వెంకటాపురం కాలనీలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. మంత్రాలయంలో రాఘవేంద్రరెడ్డి కేక్‌కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆలూరు టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కపట్రాళ్ల బుజ్జమ్మ, యువనేత గిరి మల్లేష్ గౌడ్ కేక్ కట్ చేశారు. అలాగే మద్దికెర మండల టీడీపీ ఇన్‌చార్జి దివాకర్ గౌడు, జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మండల అధ్యక్షుడు గురుప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామ దేవత మద్దమ్మకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం కేక్ కట్ చేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్



ఎమ్మిగనూరులో కేక్ కట్ చేస్తున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి



ఆదోనిలో మీనాక్షినాయుడుకు కేక్ తినిపిస్తున్న డాక్టర్ పార్థసారథి



వెల్దుర్తి, కౌతాళం గ్రామాల్లో చంద్రబాబు జన్మదిన వేడుకలు

అట్టహాసంగా వీరభద్ర గౌడ్ నామినేషన్



టీడీపీ శ్రేణులతో కలిసి నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న వీరభద్ర గౌడ్, అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వీరభద్రగౌడ్



నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పిస్తున్న వీరభద్రగౌడ్

● పట్టణంలో భారీ ర్యాలీ
● ప్రజల మద్దతుతో ఆలూరులో టీడీపీ జెండా ఎగరేస్తాం

ఆలూరు, ఏప్రిల్ 20: టీడీపీ ఆలూరు అభ్యర్థిగా వీరభద్ర గౌడ్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ శ్రేణులతో కలిసి టీడీపీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యువనేత గిరి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో యువకులు ఉత్సాహంగా చంద్రబాబు ఎన్నికల పాటలకు చిందులు వేశారు. పార్టీ జెండాలు పట్టుకుని ప్రదర్శనగా సాగారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ సెట్-1, ఆయన కుమారుడు గిరిమల్లేష్ గౌడ్ సెట్-2ను ఆలూరు ఎన్నికల అధికారి రామునాయక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ అర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మాజీ మార్కెట్ యర్డ్ చైర్మన్ కురువ జయరాం, రాంనాథ్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ మీనాక్షి నాయుడు, మండల కన్వీనర్లు అశోక్, సుధాకర్, విజయభాస్కర్, మల్లి, రాష్ట్ర నాయకులు నారాయణ రెడ్డి, నారాయణ, మనెకుర్తి రాజశేఖర్, జిల్లా నాయకులు కృష్ణం నాయుడు, నరసప్ప, కొమ్ము రామాంజినేయులు, సురేంద్ర, నాగరాజు, సోమశేఖర్ నాయుడు, గోవింద్ గౌడ్, గోపాల్ రెడ్డి, డా. తిప్పయ్య, బీజేపీ ఇన్‌చార్జీ వెంకట రాముడు, జనసేన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీడీపీ జెండా ఎగరవేస్తాం : వీరభద్రగౌడ్

ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఈ ఎన్నికల్లో ఆలూరులో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేస్తామని టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. నామినేషన్ అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ క్యాడర్‌ను ఒకే తాటి పైకి తెచ్చి అందరి సహకారంతో ఐక్యంగా విజయడంకా మోగిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

వైసీపీకి మరోసారి ఓటు వేసి మోసపోవద్దు



ఎమ్మిగనూరులో మహిళలతో బీవీ జయనాగేశ్వరరెడ్డి ముఖాముఖి, బీవీ సమక్షంలో టీడీపీలో చేరిన వేముగోడు వైసీపీ నాయకులు

● ఎమ్మిగనూరులో బీవీ జయనాగేశ్వరరెడ్డి విస్తృత ప్రచారం
● వేముగోడు వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

ఎమ్మిగనూరు, ఏప్రిల్20 : ఒక్కచాన్స్ అంటే నమ్మి ఓట్లు వేశారని, ఇప్పుడు మరోసారి ఓట్లు అభ్యర్థించేందుకు వస్తున్నారని మరోసారి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని వెంకటాపురం కాలనీలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో ముఖాముఖి నిర్వహించి కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే టీడీపీ సూపర్-6 పథకాల వల్ల ప్రజలకు జరిగే మేలును వివరించారు. చంద్రబాబు వస్తేనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని, ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే బీవీ ఆధ్వర్యంలో వెంకటాపురం కాలనీలో చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కౌన్సిలర్లు రాందాసుగౌడు, దయాసాగర్, నాయకులు బచ్చాల రంగన్న, పెద్ద రంగన్న, ఉరుకుందు, సుందర్‌రాజు, కొండయ్యచౌదరి, ముల్లాఖలీముల్లా, బిజ్జ నాగరాజు, గాజుల సుధాకర్, జయన్న పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక : గోనెగండ్ల మండలం వేముగోడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు గొబ్బెరిగాళ్ల నాగేంద్ర, గొబ్బెరిగాళ్ల వెంకటేష్, కురువ సురేష్, రాజోలి రాముడు, బావన్న, కురువ మాధన్నలతో పాటు మరో 100 మంది టీడీపీలో చేరారు. బీవీ నివాసం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరు టీడీపీ కండువాలు కప్పుకున్నారు.

రేపు సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్య నామినేషన్

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 20: ఈ నెల 22న ఇండియా కూటమి బలపరుస్తున్న సీపీఐ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి రామచంద్రయ్య నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. శనివారం స్థానిక సీఆర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించన్నామని తెలిపారు.

మూడో రోజు ఒక నామినేషన్ దాఖలు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 20: ఎమ్మిగనూరు నియోజకర్గంలో మూడో రోజు శనివారం ఒకే నామినేషన్ దాఖలైనట్లు ఆర్వో చిరంజీవి తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్వతంత్ర అభ్యర్థిగా గవ్వల నారాయణ మాత్రమే నామినేషన్ దాఖలు చేశారన్నారు. సాయంత్రం 3గంటలు దాటినా ఎవరు నామినేషన్ దాఖలు చేసేందుకు రాలేదన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థిగా గవ్వల నారాయణ నామినేషన్

ఎమ్మిగనూరు/ రూరల్, ఏప్రిల్20: నందవరానికి చెందిన గవ్వల నారాయణ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. శనివారం ఎమ్మిగనూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వో చిరంజీవికి నాగరాజు, యశోద, ఈరన్న, రాజశేఖర్ లతో కలిసి తన నామినేషన్ పత్రాన్ని అందజేశారు. మెకానికల్ ఇంజినీర్ పూర్తి చేశానని, చదువుకున్న వారు రాజకీయాల్లోకి వస్తే అభివృద్ధి జరుగుతుందని ఈ సందర్భంగా గవ్వల నారాయణ మీడియాతో అన్నారు.

కాంగ్రెస్ పార్టీకి నీలకంఠప్ప రాజీనామా

ఆదోని టౌన్, ఏప్రిల్ 20: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయ నీలకంఠప్ప శనివారం పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొందరు నాయకులు పార్టీ సిద్ధాంతాలు పాటించకుండా ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకోవడం పార్టీకి నష్టం కలిగిస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. వాల్మీకులు ఆదోని అసెంబ్లీ పరిధిలో 60 వేలు మంది, జిల్లాలో 6 లక్షల మంది దాకా ఉన్నా, ఎన్నికలలో పోటీ చేయడానికి ఒక్కరికి కూడా అవకాశం ఇవ్వకపోవడం బాధాకరం అని అన్నారు. తన రాజీనామాను పార్టీ జిల్లా అధ్యక్షుడికి పంపామని తెలిపారు. పార్టీలో సీనియర్లుగా ఉన్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్, డీసీసీఈ ఉపాధ్యక్షుడు దిలీప్ ధోకా, కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఎండీనూర్ అహ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బోయ నీలకంఠప్ప కూడా ఈసారి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయడానికి పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. కానీ చివరి నిమిషంలో ఎవ్వరూ ఊహించనట్టుగా వీరిలో ఒక ప్రైవేటు ఆసుపత్రి అధినేత అయిన రమేష్ యాదవ్‌కు టికెట్ ప్రకటించడంతో సీనియర్లు జీర్ణించుకోలేక పోతున్నారు.

సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయండి

ఆదోని, ఏప్రిల్ 20: నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించి ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినట్లైతే ప్రజలు ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా రూపొందించిన సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఆదోని ఎన్నికల అధికారి శివనారాయణ్ శర్మ శనివారం తెలిపారు. ఎన్నికల నిర్వాహణపై ఏదైనా సందేహాలు ఉంటే కమాండ్ కంట్రోల్ రూమ్ 08512-252339 హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. సబ్-కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో డబ్బు, బహుమతులు, మద్యం పంపిణీ, అనుమతి లేకుండా ప్రైవేట్ ఆస్తులపై పోస్టర్లు, ప్రచారం, ఓటర్లకు బెదిరింపులు, రాత్రి 10 గంటల తరువాత ప్రచారం తదితర వాటిపై సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. యువత ఓటు తప్పనిసరిగా వేయాలని, ఓటు వేసే సామాజిక బాధ్యతను ఎప్పటికీ మరువకూడదని పేర్కొన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు 100 నిమిషాలలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మంత్రాలయం గడ్డపై టీడీపీ జెండా ఎగరేస్తాం



మాధవరంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, రచ్చుమర్రి వైసీపీ కుటుంబాలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రాఘవేంద్రరెడ్డి, ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి
● రాఘవేంద్రరెడ్డి గెలుపు కోసం నాయకులతో భేటీ
● నియోజకవర్గంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
● రచ్చుమర్రిలో వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

మంత్రాలయం, ఏప్రిల్ 20: నియోజకవర్గం గడ్డపై తెలుగుదేశం జెండా ఎగరేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం మండంలోని మాధవరం బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, శివరామిరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, సాయికుమార్‌రెడ్డిని కలిసి టీడీపీ అభ్యర్థి గెలుపుపై చర్చించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి గెలుపు కోసం విభేదాలు మరచి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే.. అభ్యర్థితో మాట్లాడి పరిష్కరించి తగిన న్యాయం చేస్తానన్నారు. ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అఖండ విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని, దీంతో నాయకులు, కార్యకర్తలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. సమావేశంలో డీలర్ లక్ష్మన్న, రాజశేఖర్ రెడ్డి, నవకోటి నారాయణ, ముక్కన్న, గోపాల్, ఎంసీ నరసింహులు, మాల వెంకటేశ్, పాండు, ఉమాకాంత్ రెడ్డి, వీరారెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

● చిలకలడోనలో ఇంటింటి ప్రచారం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సోదరుడు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు చిలకలడోన గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచు హనుమంతు ఆధ్వర్యంలో చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించి టీడీపీకి ఓటువేయాలని కోరారు. నాయకులు తిక్కయ్య, నరసన్న, రామక్రిష్ణ, శివరాం, హోటల్ రాముడు పాల్గొన్నారు.

● కౌతాళం మండలంలో విస్తృత ప్రచారం

కౌతాళం : మండల పరిధిలోని మదిరె, పొదలకుంట, కాత్రికి గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఉదయం మదిరె, పొదలకుంట గ్రామాల్లో రాఘవేంద్ర రెడ్డి కుమారుడు రాకేష్‌రెడ్డి మండల టీడీపీ నాయకుడు సురేష్‌నాయుడుతో కలిసి టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను గ్రామ ప్రజలకు వివరించారు. నాయకులు గోవిందు, ఉరుకుంద చిరంజీవి, కాత్రికి చంద్ర, మారెప్ప, మహదేవ పాల్గొన్నారు.

రచ్చుమర్రిలో దళిత కాలనీలో వైసీపీకి షాక్

మంత్రాలయం: మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన 230 దళిత కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మాధవరం గ్రామంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి దళిత కుటుంబాలను టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ నేత అడ్వకేట్ విజయ కుమార్ ఆధ్వర్యంలో వారు టీడీపీలో చేరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



కేఈ సమక్షంలో టీడీపీలో చేరిన వెల్దుర్తి మండల వైసీపీ కార్యకర్తలు

వెల్దుర్తి, ఏప్రిల్, 20 : రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబు వల్లే సాధ్యమని టీడీపీ పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శ్రీరంగాపురం, లక్ష్మంపల్లె, చిన్నకొలుములపల్లె గ్రామాలకు చెందిన 90 మంది వైసీపీ కార్యకర్తలను కేఈ.శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ముందుగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్యాంబాబు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతను జగన్‌రెడ్డి నట్టేట ముంచారన్నారు. ప్రతియేటా జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి ఐదేళ్లలో ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి వైసీపీకి తగిన బుద్ధిచెప్పాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బాబురావు, మండల అధ్యక్షుడు బలరాంగౌడు, జ్ఞానేశ్వర్‌గౌడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

బతుకుదారి



ఓట్ల పండుగకు దూరం

కోసిగి, ఏప్రిల్ 20: వలసలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన మండలం కేంద్రం కోసిగిలోని 3వ వార్డు నుంచి దాదాపు 15 కుటుంబాలు శనివారం రాత్రి పిల్లాపాపలతో కలిసి బతుకు జీవుడా అంటూ తెలంగాణకు వలసబాట పట్టారు. మరో 20 రోజుల్లో రాష్ట్రంలో ఎన్నికల పండుగ జరుగుతున్న సమయంలోనూ.. ఇలా దూరంగా బతుకుదారి పట్టారు బక్కజీవులు. వేసవి కాలంలో కూలీలకు ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాల్సిన అధికారులు ఆఫీసులకే పరిమితం కావడంతో వలస కూలీలు పొట్టు చేతపట్టుకుని మూటముళ్లు సర్దుకుని తమ పిల్లాపాపలను వెంట పెట్టుకుని ఇంటికి తాళాలు వేసి తెలంగాణకు వలసబాట పట్టారు.